ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

వినూత్నరీతిలో 'సత్యసాయి' కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష నాల్గవ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరంలో ఆదివారం కార్మికులు ఒంటి కాలిపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అలాగే శనివారం వినాయక చవితి పండుగ పురస్కరించుకొని గణేష్ సర్కిల్‌లో వినాయకుని విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. మా సమస్యలు ప్రభుత్వానికి తెలపాలని, వేతనాలు అందించేలా ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించమని సాష్టాంగ నమస్కారాలు చేస్తూ ప్రార్థించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ పండుగ పూట సైతం కార్మికులు పస్తు ఉండే దుస్థితి నెలకొందన్నారు. 7 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సంతోషంగా చేసుకోలేకపోయారన్నారు. కార్మికుల కుటుంబాల బాధలు చెప్పలేనివి అన్నారు. కార్మికులు పని చేసిన కాలానికే వేతనాలు ఇవ్వమని అడుగుతున్నారే తప్ప ఉచితంగా అడగడం లేదన్నారు. ఇకనైనా మానవత్వంతో ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు, పిఎఫ్, చెల్లించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో రవాణా రంగం కార్యదర్శి పెదపల్లి బాబా, నీటి సరఫరా అసోసియేషన్ నాయకులు మధు, ప్రభు, శ్రీనివాసులు, వెంకటేష్, ఆంజనేయులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌పాయింట్‌లోనే 'నొక్కుడు'

- బస్తా నుంచి రెండు,మూడు కేజీలు మాయం
- మండల స్టాక్‌పాయింట్ ఇన్‌ఛార్జుల చేతివాటం
- వారికి కొందరు అధికారుల సహకారం
- మంత్రి ఇలాఖాలోనే ఇష్టారాజ్యంగా దోపిడీ
- డివిజన్ వ్యాప్తంగా ఇదే తంతు..డీలర్ల గొగ్గోలు

స్టాక్‌పాయింట్‌లో ఉన్న బియ్యం బస్తాలు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపేందుకు ప్రతినెలా రూ.వేల కోట్లు ఆర్థిక భారాన్ని భరిస్తూ రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం పూర్తిస్థాయిలో డీలర్లకు చేరడం లేదు. రేషన్ బియ్యం రవాణాలో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. కంచే చేనే మేసిన చందంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతి పందికొక్కులు స్టాక్‌పాయింట్ల వద్దే పేదల బియ్యాన్ని టన్నుల లెక్కన బొక్కేస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకమైన మండలస్థాయి స్టాక్(ఎంఎల్ఎస్)పాయింట్లు ఈ అక్రమాలకు అడ్డాగా మారాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది గోడౌన్లలో నిల్వ చేసిన ప్రతి బియ్యం బస్తా నుంచి రెండు, మూడు కేజీల చొప్పున తీసేస్తున్నారని సమాచారం. ఇలా కొన్ని వేల బస్తాల నుంచి అక్రమంగా తీసుకుంటున్న బియ్యాన్ని టన్నుల లెక్కన బయట వ్యాపారులకు అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో మూడు, నాలుగు కేజీల తరుగుతో రేషన్ షాపులకు బియ్యం బస్తాలు తరలిస్తుండంతో డీలర్లు నష్టపోతున్నారు. ఈ తరుగు బారి నుంచి తమను కాపాడాలని డీలర్లు పౌర సరఫరాల శాఖ అధికారులకు ఏళ్ల తరబడి మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే రేషన్ బియ్యం దోపిడీ అడ్డూ అదుపు లేకుండా సాగిపోతోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

రూ.లక్షల్లో దోపిడీ...

పెనుకొండ డివిజన్‌లో మొత్తం 2,31,862 రేషన్ కార్డులున్నాయి. ఈకార్డుల్లో లబ్ధిదారులుగా దాదాపు 9.5లక్షల మందికి ప్రతినెల సుమారుగా 2,320 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ కేటాయిస్తోంది. ఈ బియ్యాన్ని 502 రేషన్ షాపుల ద్వారా కార్డులదారులందరికీ పంపిణీ చేస్తున్నారు. ప్రతినెల1వ తేదీనుంచి 15వ తేదీలోపు బియ్యం ఇతర నిత్యావసర సరుకులు పంపిణీని పూర్తి చేయాలి. ఒకనెల బియ్యం పంపిణీ పూర్తికాగానే తర్వాతి నెలకు కేటాయించిన బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోడౌన్లనుంచి జిల్లా సివిల్ సప్లయ్‌కు చెందిన గోడౌన్లకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి రవాణా కాంట్రాక్టర్ల ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేస్తారు. అక్కడికి చేరేవరకు బస్తాలకు 50 కేజీల సంచులలో కచ్చితమైన తూకంతోనే రవాణా చేస్తుంటారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు కూడా అంతే కచ్చితమైన తూకంతో డీలర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు, వారి నేతృత్వంలో పని చేసే సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ ప్రతి బస్తా నుంచి రెండు నుంచి మూడు కేజీల వరకు తీసేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మేరకు తరగుతో ఉన్న బియ్యం బస్తాలను తూకం వేయకుండానే రేషన్ షాపులకు పంపిస్తున్నారు. రేషన్ డీలర్లు తూకం వేయాలని గట్టిగా నిలదీస్తున్నా అంత సమయం లేదని దబాయించి తరుగుతో ఉన్న బియ్యం బస్తాలనే పంపిస్తున్నట్లు తెలుస్తోంది. తూకం వేయకుండా రేషన్ షాపులకు తరలించిన బస్తాల్లో 2నుంచి 3 కేజీల వరకు తరగు ఉంటోందని డీలర్ల గగ్గోలు పెడుతున్నారు. ఇది కాకుండా బియ్యం సంచి బరువు 580 గ్రాములు కూడా కలిపి లెక్కిస్తే 100 క్వింటాళ్లకు దాదాపు 160 కేజీల బియ్యం నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. డివిజన్ వ్యాప్తంగా 4 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటన్నింటిలో తరుగు రూపంలో అక్రమంగా కాజేస్తున్న బియ్యం ప్రతినెల దాదాపు 500 క్వింటాళ్లకు పైగా బ్లాక్ మార్కెట్ తరలిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ మొత్తం ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు, గోడౌన్ ఇన్‌ఛార్జులు, కిందిస్థాయి సిబ్బందే మింగేస్తున్నారనుకుంటే పొరపాటే. వారు అక్రమంగా సంపాదించిన సొమ్ములో సింహభాగం తమ పైఅధికారులకు వాటాలు ప్రతి నెలా ముట్టజెప్పాల్సిందేనన్న గుసగుసలు వినపడుతున్నాయి.

తూకాలు ఎగ్గొట్టేందుకే ఆర్ఒలు జాప్యం...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతినెలా కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ పూర్తయిన తర్వాత డీలర్ల వద్ద ఉంటే ముగింపు నిల్వలను లెక్కించాలి. తర్వాతి నెలకు ఇవ్వాల్సిన కోటాలో ఈ ముగింపు నిల్వలను తగ్గించి డీలర్లకు ఆన్‌లైన్‌లో కొత్త ఆర్ఒలు జారీ చేయాలి. వాటి ప్రకారం డీలర్లు డబ్బు చెల్లించి ఎంఎల్ఎస్ పాయింట్‌లకు వెళితే అక్కడి ఇన్‌ఛార్జులు తూకం వేసి బియ్యం అప్పగించాలి. కానీ ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. ఒక నెల కోటా బియ్యం పంపిణీ 15 తేదీతో ముగిసిపోగా ఆ తర్వాత డీలర్ల వద్ద ఉన్న ముగింపు నిల్వలను లెక్కించి కొత్త ఆర్ఒలు ఇవ్వడానికి ఒక పూట లేదా ఒక రోజు సమయం సరిపోతుంది. కానీ నెలాఖరు వరకు సివిల్ సప్లయ్ అధికారులు ఆర్ఒలు ఆన్‌లైన్‌లో పెట్టడడం లేదు. ముందుగానే ఆర్ఒలు జనరేట్ చేస్తే ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యాన్ని తూకం వేసి అప్పగించాడానికి సమయం సరిపోతుంది. అదే రెండు, మూడు రోజుల ముందు ఆర్ఒలు ఇస్తే ప్రతి రేషన్ షాపునకు తూకం వేసి రవాణా చేయాలంటే అయ్యేపనికాదు. ఇదే అవకాశంగా ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు కొందరు దోపిడీకి తెరతీస్తున్నారు. ప్రతి బస్తా 50 కిలోలు ఉన్నట్లు డీలర్ పేరుతో ఇచ్చే ట్రక్ షీటులో నమోదు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని డీలర్లు తూకం వేసి ఇచ్చే సరికి ఒక్కో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తక్కువ వస్తోందని డీలర్లు వాపోతున్నారు. ఇలా ఆర్ఒలు జాప్యం చేసి తూకాలను ఎగ్గొట్టేందుకు అవకాశం కల్పిస్తున్నందు వల్ల ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు పౌరసరఫరాల శాఖ అధికారులకు ప్రతినెలా భారీస్థాయిలో ముడుపులు చెల్లిస్తున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు.

మంత్రి ఇలాకాలోనే ఇష్టారాజ్యంగా దోపిడీ...

మంత్రి ఇలాకాలోనే ఎంఎల్ఎస్ పాయింట్లలో ఇష్టారాజ్యంగా దోపిడి జరుగుతోంది. పెనుకొండ డివిజన్‌లో 4 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లకు ఉన్న ఇన్‌ఛార్జులు కాకుండా ప్రయివేటు వ్యక్తులతో విధులు నిర్వర్తింపజేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే బస్తాల్లో తీసివేసిన బియ్యాన్ని బయటకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత బహిరంగగానే బియ్యం బయటకు తరలించి అమ్ముతుంటే అధికారులు తమకు ఏమి తెలీదన్నట్లు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక మంత్రి చొరవ చూపి ఎంఎల్ఎస్ పాయింట్లలో జరగుతున్న దోపిడీని అరికట్టేందు చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

వివరాలు చెప్పడానికి ససేమేరా...

ఎంఎల్ఎస్ పాయింట్లలో ప్రతినెలా డీలర్లకు వెళుతున్న బియ్యం, కార్డుల వివరాలు అడిగితే 'మా మేడం చెప్పాల'ని కొందరు, 'మా సార్ చెప్పాలని' మరి కొందరు దాటవేస్తున్నారు. ఇన్‌ఛార్జులను వివరాలు అడగాలంటే వారు అందుబాటులో ఉండరు. ఫోన్‌లో సంప్రదిస్తే వారు ఫోన్లు ఎత్తడమే గగనమైపోతోంది. పందికొక్కుల్లా బియ్యాన్ని తింటూ సొమ్ముచేసుకుంటున్న వారిపై ఉన్న స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

ప్రతినెలా బియ్యం మిగులు చూపాల్సి వస్తోంది..

బియ్యం బస్తాల తూకం వేయకుండా డీలర్లకు సరఫరా చేయడం వల్లే ప్రతి నెల డీలర్ల వద్ద అధికంగా ముగింపు నిల్వలుంటున్నాయని డీలర్లు వాపోతున్నారు. ప్రతినెలా ఆర్ఒలు సరైన సమయానికి ఇచ్చి, బియ్యం బస్తాలు తూకాలు వేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పెనుకొండలోని స్టాక్‌పాయింట్ గోడౌన్

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జాతీయ అవార్డు గ్రహీత దళావాయి శివమ్మను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి దళావాయి శివమ్మ కేంద్ర ప్రభుత్వం అందించే 'శిల్ప గురు' జాతీయ అవార్డుకు ఎంపికైంది. దీంతో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదివారం నిమ్మలకుంట గ్రామం వెళ్లి శివమ్మను అభినందించి సన్మానించారు. వారు మాట్లాడుతూ తోలుపై అద్భుతంగా రూపొందించిన శ్రీకృష్ణ చరిత, 7 అడుగుల ఏత్తయిన విశ్వరూప హనుమాన్ కళాకండాలను కేంద్ర జౌళి శాఖ నిర్వహించే 'శిల్పగురు' జాతీయ చేతివృత్తుల అవార్డు-2023 పోటీలకు పంపారన్నారు. అందులో శివమ్మకి అవార్డు దక్కడం తోలుబొమ్మల కళాకారులు, అలాగే రాయలసీమ కళాకారులకు దక్కిన గౌరవం అన్నారు. ఇలాంటి కలలు అంతరించిపోకుండా కాపాడుకునేందుకు ఆమె చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మరింత చేయూతనందించే ప్రయత్నం చేస్తామన్నారు. హస్తకళలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. శివమ్మ స్ఫూర్తితో ప్రాచీన కళలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ ఓబిరెడ్డి, చింతలపల్లి మహేష్ చౌదరి, డాక్టర్ దళవాయి కుళ్లాయప్ప, భీమనేని విజయసారథిచౌదరి, మేకల రామాంజనేయులు, గొట్లూరు శివయ్య, చిగిచెర్ల రాఘవరెడ్డి, రేగాటిపల్లి నాగేందర్‌రెడ్డి, విజయ్‌సారథి, తదితరులు పాల్గొన్నారు.

జాబిలి చాంద్‌బాషాకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు

ప్రజాశక్తి-పెనుకొండ

జాబిలి చాంద్‌బాషా, ఆయనకు వచ్చిన సర్టిఫికెట్

ప్రముఖ కవి, రచయిత, సామాజిక సేవా కార్యకర్త, ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు అంతర్జాలం ద్వారా ధ్రువీకరణ పత్రం అందింది. జాబిలి చాంద్ బాషా 22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులను వ్యక్తిగతంగా, సామాజికంగా, మానసికం గా ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాల అభివృద్ధి విషయంలో, సామాజిక, సాహితీ సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తూ తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఇప్పటికే 200కు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలు, సత్కారాలు పొందారు. 10 వేల మంది విద్యార్థులతో జనగణమన లక్ష గళార్చన, 1250 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన, ఏటా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, తదితర సేవా కార్యక్రమా లు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. మెరుగైన సమాజం కోసం పాటుపడుతున్న జాబిలి సేవలను గుర్తించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైనట్లుగా ఈ మెయిల్ ద్వారా సర్టిఫికెట్ ప్రదానం చేశారు. జాబిలిచాంద్ బాషా ప్రస్తుతం రొద్దం మండలం కోగిర ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

అర్ధాకలితో హాస్టల్ విద్యార్థులు

మెనూ పాటించని వార్డెన్లు
వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువు

కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం తో పాటు రూరల్ మండలంలో బీసీ బాలుర వసతిగృహాల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్న పరిస్థితులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. వసతిగృహాల్లో కొన్ని చోట్ల 90 మంది పైన పట్టణంలో 150 పై చిలుకు విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ ఇంతమంది విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. టాయిలెట్లు, మూత్ర విసర్జన కోసం కేవలం మూడు స్నానపు గదులు ఉండటం గమనార్హం. కొన్ని చోట్ల ఉదయం టిఫిన్‌కి 30కి మించి విద్యార్థులు లేని పరిస్థితులు ఉండగా రికార్డులో మాత్రం 90 మంది పైన ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు వసతిగృహాల్లో కనీస వసతులు కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం 2024 -25 సంవత్సరం మెనూ ప్రకటించింది. ప్రభుత్వ మెనూ ప్రకారం వసతిగృహాలలో విద్యార్థులకు రోజు ఉదయం పాలు, టిఫిన్, సాయంకాలం స్నాక్స్, ప్రతిరోజూ రాత్రి భోజనం అరటి పండు, సాయంకాలం స్నాక్స్ లో రాగి లడ్డు, లేక గుగ్గిళ్లు, కోడి గుడ్డు అందించాలి. అయితే ఇక్కడ అధికారులు మెనూ ఏమాత్రం పాటించట్లేదు. మెనూ ప్రకారం కాకుండా విద్యార్థులకు అరకొర భోజనం వడ్డిస్తూ కొన్ని చోట్ల పాలుకు బదులు తాగునీరు, మరికొన్ని చోట్ల గుడ్డు, సాయంకాలం స్నాక్స్ అరటి పండు ఇవ్వకుండా పిల్లల కడుపు కొడుతూ అధికారులు తమ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల జేబులు ఫుల్ విద్యార్థులు కడుపులు నిల్ అన్న చందాన కదిరి వసతిగృహాల్లో విద్యార్థులు దుస్థితి ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వెరసి పిల్లలు కడుపు మడ్చుకొని అర్ధాకలితో పడుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా సంక్షేమగృహాల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సంక్షేమ వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందక విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా సంవత్సరంలో వసతిగృహాలు ప్రారంభమై మూడు నెలలు అయింది. కనీసం హాస్టల్‌ను ఉన్నతాధికారులు సందర్శించిన దాఖలాలు లేవు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దు నిద్ర వీడి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలి

బాబ్జాన్,
ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి

అధ్వానంగా ఉన్న స్నానపు గది

జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ల్యాండ్ అండ్ రికార్డ్స్ సర్వే ఎడి రామకృష్ణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ల్యాండ్ అండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణ

సత్య సాయి జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామనిజిల్లా ల్యాండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కువగా భూ తగాదాలు ఉన్నాయి. అన్నదమ్ముల మధ్య భూతగాదాలు, భూ అక్రమాలు, ఒకరు భూమిలో సాగులో ఉంటే మరొకరు పేరిట పట్టా ఉండటం, ఎన్నో ఏళ్లగా సాగులో ఉన్నప్పటికీ పట్టాలు లేకపోవడం, ఇతరుల పేరుమీద పాసు పుస్తకాలు ఉండటం, తదితర సమస్యలతో రైతులు సతమతమవుతుంటారు. తహశీల్దార్ మొదలుకొని కలెక్టర్ వరకు అర్జీలు సమర్పించుకొని కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. మరి కొందరు అయితే రెవిన్యూ అధికారులతో న్యాయం జరగలేదని కోర్టులను ఆశ్రయిస్తుంటారు. దీంతో కోర్టులలో వాజ్యం ముగిసే వరకు ఆ భూములు ఇరు వర్గాలువారు బంజరు పెట్టుకోవడం చూస్తూనే ఉంటాము. భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారుల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ముఖ్యంగా భూ సమస్యలు సర్వేర్ల వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో భూ సమస్యలు పరిష్కారాలు తదితర అంశాలపై జిల్లా ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణతో ప్రజాశక్తి జరిపిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన తెలిపారు.

ప్రశ్న : భూ సమస్యలపై జిల్లా స్థాయిలో మీరు ఏ విధంగా చర్యలు తీసుకుంటారు.?

జవాబు : సాధారణంగా భూ ఆక్రమణలు, అన్నదమ్ముల మధ్య భూ సమస్యలు, సాగులో ఒకరు ఉంటే పట్టాలు, పాసు పుస్తకాలు ఇంకొకరి పేరిట ఉండటం లాంటి సమస్యలు ఉంటాయి. ఇంకా కొందరు సరిహద్దుల సమస్యలతో వస్తుంటారు. మండల స్థాయిలో సర్వేయర్ ఉంటారు. ఆ సర్వేయర్ సరిగా న్యాయం చేయలేదని భావిస్తే ఆర్డీవో కార్యాలయంలో డిఐఒఎస్‌ఉంటారు. అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే, జిల్లాస్థాయిలో తమ దగ్గరకు వస్తారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఐఒఎస్ ఉంటారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారు. చలానా కట్టి గ్రీవెన్స్ లో అర్జీ ఇస్తే ఆ సమస్య జిల్లా స్థాయి జిల్లా సర్వేచర్ వెళ్లి రికార్డ్స్ ప్రకారం సర్వే చేయిస్తాము. కొందరు కోర్టులను ఆశ్రయిస్తుంటారు. కోర్టు పరిధిలోకి పోతే మేము ఏమీ చేయలేము.

ప్ర : జిల్లాలో ఎంత భూమి ఉంది.? జగనన్న భూ రక్ష సర్వే పై ప్రస్తుత పరిస్థితి ఏమిటి.?

జ : జిల్లావ్యాప్తంగా 20,97,382 లక్షల ఎకరాల భూమి ఉంది. గతంలో జగనన్న భూ రక్ష పేరుతో రీ సర్వే చేపట్టడం జరిగింది. జిల్లా మొత్తం 461 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇందులో 161 రెవెన్యూ గ్రామాల రీ సర్వే చేశాం. సరిహద్దు రాళ్లు నాటడం జరిగింది. ఆ రాళ్లపై జగనన్న భూ రక్ష అని రాయించాం. ఆ తరువాత ప్రభుత్వం మారింది. ఆ సరిహద్దురాళ్లపై జగనన్న భూ రక్ష అనే పేరును తొలగించాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఆదేశాలు ప్రకారం వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం త్వరలోనే గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఏదైనా భూ సమస్యలు ఉంటే ఆ గ్రామ సభలో ప్రజలు అర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చు. మిగిలిన 300 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాలిస్తే రీ సర్వే పనులు చేపడతాం.

ప్ర : జిల్లాలో పలుచోట్ల ఇంటి పట్టాలు పొంది కూడా వారి స్వాధీనంలో స్థలాలు ఉండకపోవడానికి కారణం ఏమిటి.?

జ : పలుచోట్ల పట్టా పొంది కూడా వారి స్వాధీనంలోకి భూమి రాకపోవడానికి ప్రధాన కారణం ఆయా పంచాయతీలలో ఉండే పంచాయతీలలో లేఅవుట్ అప్రూవల్ అయి ఉండాలి. అలాగే మున్సిపల్ స్థాయిలో ఉంటే అక్కడ కూడా అప్రూవల్ చేయించుకోవాలి. ఇవేమీ జరగకుంటే ఇంటి పట్టా పొంది కూడా ప్రయోజనం ఉండదు. మరికొందరు తమ సాగులో ఉందనో, లేదా తమ స్వాధీనంలో ఉందనో కోర్టులను ఆశ్రయిస్తుంటారు.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.? సిబ్బంది కొరత ఉందా.?

జ : సిబ్బంది కొరత అయితే లేదు. ఉన్నవారితోనే పనులు జరుగుతున్నాయి. ప్రజలు సాధ్యమైనంత వరకు ఆయా గ్రామాల్లో చిన్నచిన్న భూ తగాదాలు పెద్దమనుషులతో పరిష్కరించుకోవాలి. అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదు. తప్పని పరిస్థితులు అయితే సర్వే అధికారులను ఆశ్రయించవచ్చు.. ఒక్కసారి సర్వే అధికారుల సర్వేలు కూడా కాదనే వాళ్ళు ఉంటారు. జిల్లా స్థాయిలో కూడా న్యాయం జరగలేదని ఉంటే వారి ఇష్టం కోర్టులను ఆశ్రయించవచ్చు.

'సూపర్ సిక్స్' పేరిట కూటమి ప్రభుత్వం మోసం

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-పెనుకొండ

సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమితులైన తర్వాత ఉషశ్రీచరణ్ ఆదివారం మొదటిసారి పెనుకొండకు వచ్చిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ జిల్లా అధ్యక్షురాలిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకూ జగన్ అండగా ఉంటారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిందని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి గట్టిగా గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో హిందూపురం, మడకశిర నియోజకవర్గాల సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, నాయకులు పొగాకు రామచంద్ర, వజ్రభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

గోడ పత్రికను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి-పెనుకొండ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడపత్రికను ఆదివారం పట్టణంలోని ఘనగిరి స్కూల్‌లో విడుదల చేశారు. జెవివి జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ 34 ఏళ్లుగా ఉపాధ్యాయులు, వివిధ సంస్థల సహకారంతో విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి పెంచడా నికి జెవివి కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో చెకుముకి టాలెంట్ టెస్టులో పాల్గొనా లని జోన్ కమిటీ పిలుపునిచ్చింది. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25, మండల స్థాయిలో అక్టోబర్ 1 , జిల్లా స్థాయిలో అక్టోబర్ 27, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10తేదీల్లో పోటీలు జరుగుతాయని వివరిం చారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎంకె.నబి, ఘనగిరిస్కూల్ కరస్పాండెంట్ ఇలియాజ్, కమిటీ సభ్యులు, అధ్యాపకులు రాజశేఖర్, బాబు, ఉపాధ్యాయులు హనుమంత్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద సమస్యలు తలెత్తనివ్వొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా వినాయకుని మండపాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న ఓ ప్రకటనలో ఆదేశించారు. మండపాల వద్ద నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు సూచనలు తెలియజేయడంతో పాటు భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ సమితి సభ్యులు పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని తెలిపారు. విగ్రహం ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలను వారికి కేటాయించిన సమయంలోనే నిర్వహించి పోలీసులకు సహకరించాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. అవాంచనీయ సంఘటనలు జరిగితే 100, పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సిఐలు

వినాయకుని నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసే ధర్మవరంలో చెరువు వద్ద ఏర్పాట్లను ఆదివారం డీఎస్పీ శ్రీనివాసులు, వన్, టూ టౌన్ సిఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, స్థానిక బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. విగ్రహాలను తీసుకెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, విగ్రహాలు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు తగలకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజు అవాంచనీయ సంఘటనలు జరకుండా చర్యలు చేపట్టాలని డీఎస్పీ సిఐలను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతానికి చిన్నపిల్లలను తీసుకురావద్దన్నారు. డీఎస్పీ వెంట బిజెపి నాయకులు హరీశ్, డోలా రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

వరద బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం టౌన్ : వరద బాధితుల కోసం పట్టణానికి చెందిన స్పందన ఆసుపత్రి వైద్యులు సోనియా, బషీర్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేత ఆదివారం దప్పుట్లు పంపిణీ చేయించారు. వైద్యులు బషీర్ ఫోన్ ద్వారా మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ పట్టణంలో ఉన్న ఓ ప్యాక్టరీ నుంచి 3 వేల దుప్పట్లను నేరుగా విజయవాడకు తరలించి అక్కడ మంత్రి సత్యకుమార్ చేత వరద బాధితులకు అందజేశామన్నారు. అనంతరం విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసినట్లు డాక్టర్ బషీర్ తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కొత్తచెరువు : వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి 72వ జన్మదినం సందర్భంగా అభిమాను లు కేక్ కట్ చేశారు. అనంతరం అనాథ ఆశ్రమంతో పాటు స్థానిక నాగిరెడ్డిపల్లి రోడ్డులో ఏర్పాటు చేసుకున్న గుడారాల్లో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సోమశేఖర్‌రెడ్డి పేద ప్రజల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో శ్రావణ్, చంద్రుడు, వినోద్‌కుమార్, సోహెల్, సురేంద్ర, శివప్రసాద్, కేశవ, రామచంద్ర, పాల్గొన్నారు.

సోమశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేస్తున్న అభిమానులు

జీవో 117పై త్వరలోనే ఆమోదయోగ్యమైన నిర్ణయం

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా స్థాయి టోర్నీలో గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో 117పై సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి అవగాహనతో ఉన్నారని త్వరలోనే ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీకుంటారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులకు షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, వంద, 200, 400 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గుండుమల తిప్పేస్వామి ప్రారంభించి మాట్లాడారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల కోసమే కాకుండా సామాజిక సేవల్లో కూడా అగ్రగామిగా ముంటుందన్నారు. కరోనా సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వలస కూలీలకు అనేక సేవలు అందించిందన్నారు. ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. ఒత్తిడి లేని బోధన చేసేందుకు క్రీడలు ఎంతగానో దోహదనం చేస్తాయన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాబు, టోర్నమెంట్ కన్వీనర్ తహీర్‌వలి, హరికృష్ణ, మాలింగప్ప, జిల్లా కార్యదర్శులు నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, గంగాధర్, మారుతి, జోగప్ప, శ్రీనివాసమూర్తి, మనోహర్, భక్తర్, డి.నరసింహప్ప, ముద్దగిరియప్ప, నంజప్ప, ఈశ్వర్, విశ్వేశ్వర్, కదిరన్న, గుమ్మన్న, అనిల్‌కుమార్, శ్రీకాంత్, లోకేష్, ప్రసాద్, శివశంకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కొత్తచెరువురూరల్

వరద బాధితుల కోసం సిఎం చంద్రబాబు, మంత్రులు రాత్రింబవళ్లు పని చేస్తూ ప్రజలకు అండగా నిలిచారని, అలాంటి వ్యక్తిపై వైసిపి అధినేత జగన్ బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హితవు పలికారు. మండలంలోని కేశాపురం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలో వైసిపి నాయకుడు కె.లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారిలో గాండ్ల రామ్మోహన్, గాండ్ల జనార్దన్, బి.నరేంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గాండ్ల లక్ష్మీనారాయణ, రామకృష్ణ, జయవర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రాజారెడ్డి, మోహన్ , నరసింహారెడ్డి, గాండ్ల వెంకటనారాయణ, గాండ్ల మంజునాథ్, కె. పోతలయ్య, బి.బాబు, నారేపల్లి గొల్ల నాగేంద్ర, గంజి కిష్టప్ప, తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. గత ఐదేళ్లల జగన్‌రెడ్డి నిర్వాకం వల్లే విజయవాడలో కొన్ని కాలనీలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలను ఆదుకున్న సిఎం చంద్రబాబుపై జగన్ నీచ రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కి ప్రజలు గట్టిగా గుణపాఠం చెప్పినా ఇంకా అతడికి బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వరద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సిఎం చంద్రబాబుతో పాటు ఎందరో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ఆదుకున్నారని గుర్తు చేశారు. కళ్లు ఉండి చూడలేని జగన్ కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతూ పబ్బం గడుపుతున్నాడని మండిపడ్డారు. వైసిపి గల్లంతవుతుందనే భయంతోనే జగన్ వరదలపై నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా జటన్ నీచ రాజకీయాలు మానకపోతే ప్రజలు క్షమించరని, ఆయనను శాశ్వతంగా ఇంటికే పరిమితం చేస్తారని హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో వైసిపి కనుమరుగు కావడం ఖాయం అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డికి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు బండ్లపల్లి కిష్టప్ప, పిసి.గంగన్న, చంద్రశేఖర్, శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

హంద్రీనీవా నీటితో చెరువులు నింపుతాం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని చెరువులను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వారు ఆదివారం దాదులూరు వద్ద ఉన్న చెక్ డ్యాంను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చుతామని తెలిపారు. కుంటిమద్ది చెరువుకు ఇప్పటికే హంద్రీనీవా నీరు అందే అవకాశం ఉందని, అక్కడి నుంచి గంతిమర్రి చెరువుకి నీరు వస్తాయని అక్కడి నుంచి దాదులూరు చెక్ డ్యాంకు నీరు వస్తాయన్నారు. అక్కడి నుంచి రేగాటిపల్లి, పోతుకుంట, గొట్లూరు, అప్రాచెరువులకు నీరు చేరుతుందన్నారు. హంద్రీనీవా నీటి సరఫరాకు నియోజకవర్గంలో ఎక్కడా అడ్డంకులు లేకుండా చూస్తామన్నారు. గత ఐదేళ్లలో నీరు వచ్చినా వినియోగించుకోవడంలో విఫలమయ్యారన్నారు. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా హంద్రీనీవా ద్వారా వీలైనంత ఎక్కువ నీరు నియోజకవర్గానికి తీసుకుంటామన్నారు. వారి వెంట టిడిపి నాయకులు చింతలపల్లి మహేష్‌చౌదరి, రేగాటిపల్లి నాగేందర్‌రెడ్డి, విజయ్‌సారథి, జనసేన నాయకులు సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

దాదులూరు చెక్ డ్యాంను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆర్‌డిటి మైదానంలో జరుగుతున్న శ్రీఅటల్‌బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన ఐదు మ్యాచుల్లో పది జట్లు పాల్గొన్నాయి. తొలి మ్యాచ్‌లో స్టార్-11 మారుతీ నగర్ పార్క్-11 జట్లు తలపడగా స్టార్-11 జట్టు 38 పరుగులు తేడాతో గెలుపొందింది. పవన్-11 కెటిసి, సికె.పల్లి ఫ్రెండ్స్-11 జట్ల మధ్య జరిగిన పోటీలో సికె పల్లి ఫ్రెండ్స్-11 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫయాజ్-11, శ్రీహరిపురం రాకెట్స్-11 మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫయాజ్-11 49 పరుగుల తేడాతో విజయ కేతనం ఎగుర వేశారు. ఎస్‌విపి పాతపాలెం, రొద్దం జట్లకు మధ్య జరిగిన మ్యాచ్‌లో రొద్దం జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. బసంపల్లి, పెనుకొండ థండర్స్ జట్ల మధ్య జరిగిన పోటీలో బసంపల్లి జట్టు 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆయా మ్యాచుల్లో ప్రతిభ చూపిన స్టార్-11 జట్టు సభ్యుడు బ్యాడ్ బాయ్, సికె.పల్లి ఫ్రెండ్స్ టీంలో అశోక్, ఫయాజ్ టీంలో ఫయాజ్ షేక్, రొద్దం టీంలో చంద్ర, బసంపల్లి టీంలో యువరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది హరీష్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, డి.చెర్లోపల్లి నారాయణస్వామి, జింకా చంద్ర ఓబులేష్, శారదమ్మ, రాధమ్మ, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న క్రికెట్ క్రీడాకారులు

వినాయక మండపాల వద్ద ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

వినాయక మండపాల వద్ద ముగ్గుల పోటీలు

గోకులంలో అన్నదానం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని వాడవాడలా వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ప్రశాంతి నిలయంలో నిర్వహించిన చవితి పూజల్లో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ దంపతులతో పాటు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలో పెద్ద విగ్రహాలు పోటా పోటీగా దర్శనమిస్తున్నాయి. పండుగ పురస్కరించుకొని పట్టణంలోని వివేకానందనగర్ యూత్ వినాయక కమిటీ సభ్యుడు జయసాయి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు పట్టణ సిఐ సునీత చేత చీరలు పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని కుమ్మరిపేట, గోకులంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోకులం యూత్ వినాయక కమిటీ సభ్యులు రాజశేఖర్ యాదవ్ మాట్లాడుతూ దాదాపు 800 మందికి అన్నదానం చేశామన్నారు. సోమవారం చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టే కార్యక్రమం, వినాయక లడ్డూ వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌యాదవ్, బెస్త జయసాయి, నాగతేజ, తారకసాయి, విక్కీ, శేషు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ ఉలవలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

గుడిబండ : రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీపై అందజేస్తున్న ఉలవ విత్తనాల కోసం మండలంలోని రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో వీరనరేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 10 కిలోల ఉలవల ప్యాకెట్ ధర రూ. 870 కాగా రూ. 696 రాయితీ పోనూ రైతు రూ. 174 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథుడు

ప్రజాశక్తి-హిందూపురం

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ, పరిసర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వివిధ గణపతి సేవాసమితులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ రూపాల్లో గణపతి భక్తులకు దర్శనమిచ్చాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏడాది పట్టణంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్యంగా స్థానిక ఆర్‌టిసి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అనంత ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూరప్ప కట్ట కింద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంటు అధ్యక్షులు వడ్డే అంజనప్ప పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, నాయకులు అమర్నాథ్, మంగేష్, న్యాయవాది శివశంకర్, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప, వెంకటరమణ, శివకుమార్, కౌన్సిలర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపి అంబికా

డిసిసి అధ్యక్షులుగా ఎంహెచ్. ఇనయతుల్లా

హిందూపురం : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎంహెచ్. ఇనయతుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ ఆయనకు నియామక ఉత్తర్వులను పంపారు. ఇనయతుల్లా గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనను శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షునిగా నియమించడం పట్ల పార్టీ అగ్ర నేతలకు ఇనయతుల్లా కృతజ్ఞతలు తెలిపారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్ : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కక్షిదారులు రాజీ మార్గాన వెళ్లి లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం చేసుకునే దిశగా చూడాలని జిల్లా ఎస్పీ వి.రత్న అధికారులకు సూచించారు. ఈ నెల 14వ తేదీ కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందని, త్వరితగతిన కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎస్పీ సోమవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల అధికారులతో వారి వారి స్టేషన్లకు సంభందించి కేసులు, రాజీ అయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరు పక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఇరుపక్షాల సమ్మతితో ఆయా కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో కేసులు పెండింగ్ ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, ఇరు పక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయని వారికి తెలియజేయాలని సూచించారు. కేసుల విషయంలో కక్షిదారులకు అపోహలు తొలగించాలని, వారి సమ్మతితో ఇరు వర్గాల వారిని ఒప్పించి రాజీ చేయడం వల్ల పోలీసులపై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడుతుందని ఎస్పీ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న ఎంపి బికె పార్థసారథి

రోడ్డు ప్రమాద బాధితుడికి ఎంపీ పరామర్శ

రొద్దం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని హిందూపురం ఎంపి బికె.పార్థసారథి పరామర్శించారు. వివరాలు.. మండలంలోని ఎల్‌జిబి నగర్ చుట్టు పక్కల గ్రామాల వారు ఓ ఆటోలో కర్నాటకలోని నాగలమడకకు పెళ్లికి బయల్దేరారు. కోగిర, కంచెసముద్రం గ్రామాల మధ్యలో ఓ మలుపు వద్ద ఆటో అతివేగంగా వెళ్లడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండలంలోని ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. రెండు కాళ్లు విరగడంతో 108 వాహనంలో పెనుకొండకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎంపి పార్థసారథి ఆదివారం అనంతపురం ఆసుపత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని దందేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చెన్నప్ప కుమారుడు నాగేష్ అకస్మాత్తుగా మృతి చెందాడు. దీంతో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు టిడిపి మండల నాయకులు ఆ గ్రామం వెళ్లి నాగేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే చెన్నప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, టిడిపి సీనియర్ నాయ కులు మాధవనాయుడు, ఆంజనేయులు, నరసింహులు, పవన్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్తల మృతికి 'పల్లె' నివాళి

నల్లమాడ : మొలకలచెరువు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇడుగుట్టు గంగాధర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలియడంతో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మండలంలోని దొన్నికొట గ్రామం వెళ్లి గంగాధర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం కొత్తబత్తలపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి కోడలు ఝాన్సీ హఠాన్మరణం వార్త తెలుసుకొని పల్లె రఘునాథరెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించండి

ప్రజాశక్తి-హిందూపురం

వక్ఫ్ ఆస్తులను కాజేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని హిందూపురం ముస్లిం సోదరులు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. ఆదివారం పట్టణంలోని అంబికా లక్ష్మీనారాయణ నివాసంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులు ఎంపీని కలిసి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూఖ్ ఖాన్, అహలే సన్నతుల్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌల, కార్యదర్శి అబ్దుల్ రహమాన్ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు వక్ఫ్ సంస్థలను దెబ్బతీసేలా ఉందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన అప్రజాస్వామిక వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తిరస్కరించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి అంబికాకు వినతి ఇస్తున్న ముస్లింలు

ప్రెస్ క్లబ్ భవనం అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, ఎపిపి ఇందాద్, టిడిపి లీగల్ సెల్ శివ శంకర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది వన్నురప్ప అన్నారు. నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు శనివారం న్యాయవాదులు ప్రెస్ క్లబ్ కు వచ్చారు. ఈ సందర్భం గా ప్రెస్ క్లబ్ ఆవరణంలో మొక్కలను నాటారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్ షబ్బీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జర్నలిస్టులు న్యాయవాదులను సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్, ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు రామాజినేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్ మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం హిందూపురంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందన్నారు. దాతల సహకారంతో భవనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. న్యాయవాదులు తమవంతు సహకారం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయవాది వన్నూరప్ప తమ వంతుగా రూ. 20వేలు అందిస్తామని ప్రకటించారు. శివ శంకర్ రూ.10వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు అల్లీపీరా, రమేష్, ప్రదీప్, శ్రీనివాస రెడ్డి, దాసప్ప తదితరులు పాల్గొన్నారు.